క్లుప్తంగా

కోరుకొల్లులో ప్రత్యేక పూజలు



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్, తదితరులు

కైకలూరు: వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని గంగుల బాపిరాజు ఆధ్వర్యంలో కలిదిండి మండలం కోరుకొల్లు రామాలయం వద్ద మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే డీఎన్నార్ ఆలయంలో పూజలు చేసి, భారీ అన్న సమారాధనను ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఎమ్మెల్యేను సత్కరించారు. సమారాధనలో ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చెన్నంశెట్టి కోదండరామయ్య ఉప సర్పంచ్ చెన్నంశెట్టి నాగరాజు, సొసైటీ అధ్యక్షుడు అంకెం నరసయ్య నేతలు మామిడిశెట్టి నాగమణి, వలవల ప్రసాద్ పాల్గొన్నారు.

నేడు కొత్త పింఛన్ల పంపిణీ

దోసపాడు(పెదపారుపూడి): మండలంలోని దోసపాడు కల్యాణ మండపంలో కొత్తగా మంజూరైన పింఛన్‌దారులకు ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ చేతుల మీదుగా బుధవారం పింఛన్లు అందజేస్తామని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్, ఎంపీపీ గోగం సురేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని ఎంపీపీ కోరారు.

మినుము పంట ఈ క్రాప్ నమోదు పూర్తి చేయాలి

మండవల్లి: మినుము పంట ఈ క్రాప్ నమోదు పూర్తి చేయించాలని సహాయ వ్యవసాయ సంచాలకులు జి.వెంకటమణి పేర్కొన్నారు. స్థానిక వ్యవసాయాధికారి కార్యాలయంలో గ్రామ వ్యవసాయ సహాయకులకు శిక్షణ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఏడీఏ వెంకటమణి మాట్లాడుతూ పీఎం కిసాన్ ఈకేవైసీ చేయించుకోని రైతులు వెంటనే చేయించుకునేవిధంగా అవగాహన కల్పించాలన్నారు. ధాన్యం కొనుగోలులో ఇబ్బంది లేకుండా చూడాలని చెప్పారు. ఏఓ ఎస్కే జరీనా మాట్లాడుతూ.. సీసీఆర్ కార్డులు తీసుకున్న రైతులను ఐదుగురిని ఒక జేఎల్‌జీ గ్రూపుగా ఏర్పాటు చేసి బ్యాంక్‌లో రుణం ఇప్పించాలని సూచించారు. వీఏఏలు పాల్గొన్నారు.

అల్లినగరంలో పొలంబడి



మండవల్లి: మండలంలోని అల్లినగరం గ్రామంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఆధ్వర్యంలో మంగళవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. పుల్ల మజ్జిగ వల్ల ఉపయోగాలు, రాజీ లేని సూత్రాలను మాస్టర్ ట్రైనర్ పృథ్వీ రైతులకు వివరించారు. ప్రకృతి వ్యవసాయ సేద్యం ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. డిజిటల్ సీఆర్పీ గౌతమ్‌కుమార్, సీఆర్పీ నాగవిజయ, ఐసీఆర్పీలు పాల్గొన్నారు.

రేపు ముదినేపల్లిలో వైద్య శిబిరం

ముదినేపల్లి రూరల్: ముదినేపల్లి సచివాలయం వద్ద గురువారం ఉదయం ఉచిత వైద్య శిబిరం జరుగుతుందని నిర్వాహకుడు హనుమార పేరీన్డు తెలిపారు. అను హాస్పిటల్స్ (విజయవాడ) వైద్యులు గుండె, మెదడు, నరాలు, ఎముకలు, థైరాయిడ్‌కి సంబంధించిన వ్యాధులకు, బీపీ, సుగర్, ఈసీజీ, ఎకో వంటి పరీక్షలు ఉచితంగా నిర్వహించడంతో పాటు మందులు పంపిణీ చేస్తారన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మినుములో కలుపు, ఊదాలను నివారించాలి

పామర్రు: మినుము సాగులో ప్రస్తుతం ఉన్న కలుపు, ఊదా, బంగారుతీగలను తొలగిస్తే మంచి దిగుబడులు వస్తాయని వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. మండల పరిధిలో 23 వేల ఎకరాల్లో మినుము సాగు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మినుము పంటలో కలుపు, ఊదా, బంగారుతీగ తదితరాలు దర్శనమిస్తున్నాయి. వీటి నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. సాగులో అక్కడక్కడ దురదగుంట ఆకులు వస్తున్నాయని వీటి నివారణకు ఇమజిత్‌ఫిర్ మందును ఒక లీటరును 5 ఎకరాల్లో పిచికారీ చేయాలన్నారు.

పాల సేకరణ ధర పెంపుపై హర్షం

మండవల్లి: విజయ డెయిరీ పాల సేకరణ ధర లీటర్‌కు రూ.5 పెంచుతూ కృష్ణా మిల్క్ యూనియన్ తీసుకున్న నిర్ణయం హర్షణీయమని ఆ యూనియన్ అధ్యక్షుడు పెరికెగూడెం సంఘం అధ్యక్షుడు పిండి రాధాకృష్ణారెడ్డి, వేతన కార్యదర్శి అమ్మిడి వెంకట శ్రీనివాసరావు, రైతులు పేర్కొన్నారు. మండవల్లి మండలం పెరికెగూడెంలో విజయ డెయిరీ పాల సేకరణ కేంద్రం వద్ద మంగళవారం పాల ఉత్పత్తిదారుల సమావేశం నిర్వహించారు. 500 మంది పాల రైతులు, గేదె, ఆవు పాలు పోస్తున్నట్లు కార్యదర్శి శ్రీనివాసరావు పేర్కొన్నారు. పాడి రైతులు పాము వెంకయ్య, జంగం ప్రసాద్, పిండి శేషయ్య, మాణిక్యాలరావు పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా పింఛన్ల పంపిణీ

- ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్
- కోలాహలంగా పెన్షన్ వారోత్సవాలు ప్రారంభం



పామర్రులో నూతన పెన్షన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్, ప్రజాప్రతినిధులు

పామర్రు: కులం, మతం, ప్రాంతం, పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్ పంపిణీ చేస్తున్నామని ఎమ్మెల్యే కై లే అనిల్‌కుమార్ అన్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో పెన్షన్ వారోత్సవాల్లో భాగంగా వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ కార్యక్రమంలో మంగళవారం ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కైలే మాట్లాడుతూ.. సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు సమన్వయంతో ఉంటూ పార్టీ పథకాలను అందరికీ అందజేయాలన్నారు. మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చడంతో పాటు ఇవ్వని హామీలను సైతం అమలు చేస్తున్నామని చెప్పారు. గతంలో పింఛన్ మంజూరు కావాలంటే పింఛన్ తీసుకుంటున్న వారిలో ఎవరో ఒకరు మరణిస్తే ఆస్థానంలో కొత్త పెంఛన్ ఇచ్చేవారని, నేడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్క అర్హునికి పెన్షన్‌ను మంజూరు చేస్తున్నామని చెప్పారు. ఇటీవల కొన్ని కారణాలతో నోటీసులు జారీ చేసిన వారందరికీ తిరిగి రీ వెరిఫికేషన్ చేసి వారికి కూడా పింఛన్లు అందజేసే విధంగా తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

టీడీపీ ప్రచారాన్ని తిప్పికొట్టాలి..

పెన్షన్‌లను తొలగిస్తున్నామని టీడీపీ దుర్మార్గపు ప్రచారాన్ని చేస్తోందని దీనిని ప్రజలుఅందరూ తిప్పికొట్టాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి నిరంతరం పని చేస్తున్నారన్నారు. ప్రతి ఒక్కరూ జగన్‌కు అండగా నిలవాలని కోరారు. మండల పరిధిలో 7,037 పెన్షన్‌లు ఉండగా ప్రస్తుతం ఈ ఏడాది జనవరి నుంచి 227 కొత్త పెన్షన్‌లు కలిసి 7,464 పెన్షన్‌లు పంపిణీ చేస్తున్నామన్నారు. గ్రామ సచివాలయ కన్వీనర్లు వారి పరిధిలో ఉన్న ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారం కోసం కృషి చేయాలని సూచించారు. అర్హులకు సకాలంలో పథకాలు అందే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్, జెడ్పీటీసీ కె.స్వరూపరాణి, వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు, కో ఆప్షన్ సభ్యుడు ఎండీ హస్మతుల్లా, ఎంపీటీసీలు టి.శ్రీనివాసరావు, పి.రత్నకుమారి, నాగమల్లేశ్వరరావు, సర్పంచ్ కేతావతు కస్తూరి,మండల సమాఖ్య అధ్యక్షురాలు ధనాల కృపావతి, పలు గ్రామాల సర్పంచ్‌లు, కార్యదర్శులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



నందివాడలో పెన్షన్ పంపిణీ చేస్తున్న ఎంపీపీ ఆదాం, నాయకులు

ప్రభుత్వానికి అండగా ఉందాం..

గుడివాడటౌన్(నందివాడ): తన సుదీర్ఘ పాదయాత్రలో ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉండాలని నందివాడ ప్రజా పరిషత్ అధ్యక్షుడు పెయ్యల ఆదాం కోరారు. నందివాడ మండల కేంద్రంలోని ఓ కన్వెన్షన్ హాలులో మంగళవారం కొత్త పెన్షన్‌ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ ఇచ్చిన హామీ మేరకు పెన్షన్‌ను పెంచుతున్నారన్నారు. ఇప్పటికే మండలం మొత్తంలో 4,923 మందికి పెన్షన్లు ఇస్తుండగా కొత్తగా 122 మందికి ఈ ఏడాది పెన్షన్లు మంజూరు చేశామని చెప్పారు. వీరందరికి కలిపి నందివాడ మండలంలోనే కోటి 36 లక్షల 79 వేల 250 రూపాయలు ప్రతి నెల పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కందుల దుర్గాకుమారి, ఇలపర్రు ఎంపీటీసీ బి.రంగమ్మ, ఎంపీడీఓ బీవై విష్ణుప్రసాద్, ఈఓపీఆర్డీ జి.శ్రీనివాసరావు, సర్పంచ్‌లు సరెళ్ల రత్నకుమారి, టి.అరుణ కుమారి, డి.మరియమ్మ, నాయకులు కృష్ణారెడ్డి, నాగూర్‌బాబు, సరెళ్ల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పథకాలు అందించాలి

ఎమ్మెల్యే కొడాలి నాని

గుడివాడరూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలు, ప్రభుత్వ సేవలను ప్రజలకు అందించేందుకు వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు కలిసి పని చేసి ప్రభుత్వానికి, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మంచి పేరు తీసుకురావాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) పేర్కొన్నారు. మండల పరిధిలోని ఓ కన్వెన్షన్‌లో మండలానికి చెందిన వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లకు నిర్వహించిన అవగాహన సదస్సులో మంగళవారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

15 నుంచి గృహ సారథుల నియామకం

ఈ సందర్భంగా కొడాలి నాని మాట్లాడుతూ ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి దీనికి అనుబంధంగా వలంటీర్లను నియమించిందన్నారు. ప్రజల వద్దకే ప్రభుత్వ పథకాలు వెళ్లాలనేదే ముఖ్య ఉద్దేశమన్నారు. వలంటీర్ల సేవలను ప్రజలకు తెలియచేసేందుకు కన్వీనర్లు కృషి చేస్తారని చెప్పారు. దీంతో వలంటీర్లకు తోడుగా మరింత మెరుగైన సేవలు ప్రజలకు చేరువ చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందన్నారు. వీరికి తోడుగా జనవరి 15వ తేదీ నుంచి గృహ సారథులను నియమిస్తామన్నారు. ఒక్కో వలంటీర్‌కు ఇద్దరు గృహ సారథులను నియమిస్తామని స్పష్టం చేశారు. వీరంతా రానున్న ఎన్నికల నాటికి ప్రజల అవసరాలను తెలుసుకుని ప్రజా ప్రతినిధులకు చేరవేస్తారన్నారు. దీని ద్వారా ప్రస్తుత ప్రజల అవసరాలను మరిన్ని గ్రహించి పరిష్కరించడం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఉద్దేశమని చెప్పారు. ప్రభుత్వ లక్ష్యాలను నెరవేర్చాలని ఆయన కోరారు. కార్యక్రమంలో గుడివాడ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ పరిశీలకుడు ఎస్ఎంఆర్ ప్రసాద్, సీనియర్‌నాయకుడు దుక్కిపాటి శశిభూషణ్, ఎంపీపీ గద్దే పుష్పరాణి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మట్టా జాన్‌విక్టర్, వైస్ ఎంపీపీలు గుంజా వంశీధర్, భట్టు నాగమల్లేశ్వరి, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ మేకల సత్యానారాయణ, నాయకులు గొర్రె పాండు రంగారావు, గద్దే రాము, పీఏసీఎస్ అధ్యక్షులు ఇమ్మడి అశోక్, ఏలేటి ఆంజనేయులు(ఆగస్టిన్), మార్కెట్ యార్డు డైరెక్టర్ కలపాల కిరణ్, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొడాలి నాని, వేదికపై నాయకులు

రాష్ట్ర స్థాయి పోటీల్లో విద్యార్థి ప్రతిభ



సాత్వికను అభినందిస్తున్న కళాశాల డైరెక్టర్, ప్రిన్సిపాల్

గుడివాడరూరల్: రాష్ట్రస్థాయి పోటీల్లో తమ కళాశాల విద్యార్థికి తృతీయ బహుమతి రావడం ఆనందంగా ఉందని వీకేఆర్ అండ్ వీఎన్‌బీ ఇంజినీరింగ్ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ వేములపల్లి కోదండ రామయ్య పేర్కొన్నారు. మంగళవారం కళాశాలలో బహుమతి సాధించిన విద్యార్థిని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ కళాశాలలో బి.టెక్ ఎలక్ట్రానిక్స్ తృతీయ సంవత్సరం చదువుతున్న గురివిందపల్లి సాత్విక్ ఇటీవల ఆంధ్రప్రదేశ్ యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో కె.ఎల్. విశ్వ విద్యాలయంలో నిర్వహించిన క్లాసిక్ మ్యూజిక్ పోటీల్లో తబలాపై తన ప్రావీణ్యాన్ని ప్రదర్శించి రాష్ట్రస్థాయి తృతీయ బహుమతిని సాధించాడన్నారు. విజేతలకు జ్ఞాపిక, ప్రశంసా పత్రాన్ని యువజనశాఖ అందచేసిందని చెప్పారు. విజేతను అభినందించిన వారిలో కళాశాల డైరెక్టర్ బి.కళ్యాణ్ కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌హెచ్‌వీ ప్రసాదరావు, కల్చరల్ విభాగాధిపతి ఎస్.ముత్యాలు, కల్చరల్ కమిటీ కన్వీనర్ డాక్టర్ కె.దశరథి, అధ్యాపకులు, విద్యార్థులు ఉన్నారు.

గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి



స్థానికులతో మాట్లాడుతున్న ఎంపీపీ కృష్ణ

కైకలూరు: గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎంపీపీ అడవి కృష్ణ అన్నారు. కైకలూరు మండలం ఆచవరం శివారు ఆనందరావుపేటలో మంగళవారం ఆయన పర్యటించి గ్రామ సమస్యలపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా దళితులకు భరోసా అనే శీర్షికతో గ్రామంలో శ్మశానం లేక ప్రజలు పడుతోన్న ఇబ్బందులను సాక్షిలో మంగళవారం ప్రచురించారు. దీనిపై స్పందించిన ఎంపీపీ మాట్లాడుతూ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) సహకారంతో సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని చెప్పారు. ఎంపీపీ వెంట వైస్ ఎంపీపీ ఎండీ జహీర్, తహసీల్దార్ మురళీకృష్ణ, ఎంపీడీఓ రామలింగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి కిరణ్ ఉన్నారు.

ఆదర్శనీయురాలు సావిత్రీబాయి పూలే



ఏఎన్నార్ కళాశాలలో నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ పీజేఎస్ కుమార్, అధ్యాపకులు



పామర్రులో ఉపాధ్యాయినిని సత్కరిస్తున్న కళాపీఠం సభ్యులు



కైకలూరు జాగృతి స్కూల్‌లో నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

గుడివాడరూరల్: మహిళల విద్యకు పాటుపడిన సావిత్రీ బాయిపూలే ఆదర్శనీయురాలు అని ఏఎన్నార్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీజేఎస్ కుమార్ పేర్కొన్నారు. స్థానిక ఏఎన్నార్ కళాశాల చరిత్ర విభాగం, మహిళాభివృద్ధి కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో సావిత్రీ బాయిపూలే జయంతిని పురస్కరించుకుని జాతీయ మహిళా దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె జీవిత విశేషాలు, మహిళల విద్యకు ఆమె చేసిన కృషిని ప్రిన్సిపాల్ వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శివనాథ్, చరిత్ర అధ్యాపకుడు ఎం.కిరణ్‌కుమార్, మహిళాభివృద్ధి కేంద్రం అధ్యక్షులు డాక్టర్ ఎంబీ సువర్చల, విద్యార్థులు పాల్గొన్నారు.

లయన్స్ ప్రగతి ఆధ్వర్యంలో...

స్వర్గీయ సావిత్రీ బాయిపూలే జయంతి వేడుకలను లయన్స్‌క్లబ్ గుడివాడ ప్రగతి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక జగన్నాథపురం మున్సిపల్ ప్రాథమిక పాఠశాల విద్యార్థుల సమక్షంలో పూలే జయంతిని నిర్వహించి, పూలే సేవలను వివరించారు. కార్యక్రమంలో ప్రగతి అధ్యక్షుడు మల్లంపల్లి వెంకట్రావ్, కార్యదర్శి నల్లారి శేషగిరిరావు, జిల్లా నాయకుడు ఎంవీ శేఖర్, ఆర్.మురళీధర్, రామదేని వేణు బాబు పాల్గొన్నారు. అనంతరం చిన్నారులకు మిఠాయిలు, బిస్కెట్లు, జామెంట్రీ బాక్స్‌లు అందజేశారు.

సావిత్రిబాయి పులే కృషి మరువలేనిది

గుడివాడరూరల్: మహిళ సాధికారతకు సావిత్రీ బాయిపూలే చేసిన కృషి మరువలేనిదని గ్రేడ్-1 గ్రంథాలయ అధికారి బేరం వెంకటరమణ పేర్కొన్నారు. స్థానిక షా గులాబ్ చంద్ ప్రథమ శ్రేణిశాఖ గ్రంథాలయంలో మంగళవారం భారతదేశ తొలి మహిళ ఉపాధ్యాయురాలు సావిత్రీపూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. పాఠకులు భాస్కర్, శ్రీనివాస్, నాగరాజు, రవితేజ, భాను, రామకృష్ణ, మాధురి, సిబ్బంది టి.ప్రవల్లిక, క్రాంతి, డీఆర్‌బీ ప్రసాద్ పాల్గొన్నారు.

రంగాపురం పాఠశాలలో జయంతి

ముదినేపల్లిరూరల్: ప్రముఖ సంఘసంస్కర్త తొలి మహిళా ఉపాధ్యాయినీ సావిత్రీ బాయిపూలే జయంతి కార్యక్రమాలు ముదినేపల్లి మండలంలోని పలు పాఠశాలల్లో మంగళవారం నిర్వహించారు. ఆమె చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పెయ్యేరు శివారు రంగాపురం ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎం బేతాళ రాజేంద్రప్రసాద్, వడాలి జెడ్పీ హైస్కూల్లో హెచ్ఎం బీఎస్ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో, చిగురుకోట శివారు నరసన్నపాలెం, గురజ1, 2 ప్రాథమిక పాఠశాలల్లో పూలే జయంతి కార్యక్రమాలు నిర్వహించారు.

మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి

పామర్రు: మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని పామర్రు ఘంటసాల కళాపీఠం అధ్యక్ష, ఉపాధ్యక్షులు కాటూరి వెంకట మురళీ కృష్ణ, కోటి పాండురంగారావు తెలిపారు. సావిత్రీ బాయిపూలే జయంతిని పురస్కరించుకుని మంగళవారం స్థానిక కార్యాలయంలో ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పూలే చేసిన సేవలకు గుర్తుగా ఆమె జయంతిని జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు. మహిళా ఉపాధ్యాయిని కాటూరి ఉమాదేవిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పీఠం సభ్యులు టి.మురళీ కృష్ణ, దగ్గుమిల్లి హరికృష్ణ, అప్పారావు పాల్గొన్నారు.



రంగాపురంలో నివాళులర్పిస్తున్న టీచర్, విద్యార్థులు

జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవం

కైకలూరు: జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని మంగళవారం జాగృతి స్కూల్‌లో ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు, సిబ్బంది ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ పి.జయకిషోర్‌బాబు మాట్లాడుతూ..దేశంలో ప్రముఖ సంఘసంస్కర్తల్లో పూలే ఒకరని కొనియాడారు. భర్త జ్యోతీరావు పూలేతో కలిసి మహారాష్ట్రలోని పూణెలో 1848వ సంవత్సరంలో బాలికల పాఠశాలను ప్రారంభించారని గుర్తుచేశారు. ప్రిన్సిపాల్ నసీరున్నిసా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటా సంక్షేమ పథకాల వెలుగులు



లోకుమూడిలో సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే డీఎన్నార్

మండవల్లి: సంక్షేమ పథకాలతో ప్రతి ఇంటిలో వెలుగులు విరాజిల్లుతున్నాయని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) అన్నారు. మండవల్లి మండలం లోకుమూడిలో సర్పంచ్ కరేటి నాగమణి, ఎంపీటీసీ సభ్యుడు పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. మూడేళ్లలో ప్రజలకు అందిన లబ్ధికి సంబంధించిన బ్రోచర్‌లను అందజేశారు. ప్రజా సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు.

పార్టీలకతీతంగా పథకాల అమలు

ఈ సందర్భంగా ఎమ్మెల్యే డీఎన్నార్ మాట్లాడుతూ.. కుల, మత, ప్రాంత, పార్టీ అనే బేధాలు లేకుండా పథకాలను అందరికీ అందజేస్తున్నామన్నారు. అర్హతే ప్రామాణికంగా పథకాలను అందించి ప్రజలను స్థితిమంతులుగా మార్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజలను కలుసుకుని, సమస్యలు తెలుసుకుని మేలు చేసే అవకాశం గడప గడపకు మన ప్రభుత్వం కల్పిస్తుందని ఎమ్మెల్యే డీఎన్నార్ పేర్కొన్నారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకుని, వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామ దుర్గాప్రసాద్ (రాము), జెడ్పీటీసీ ముంగర విజయనిర్మల, పార్టీ మండల అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు బేతపూడి యేసోబురాజు, మండల వ్యవసాయ మండలి అధ్యక్షురాలు జంగం వరలక్ష్మి, సర్పంచ్‌లు కరేటి నాగమణి, తలారి ధనలక్ష్మి, నాయకులు మాజీ ఎంపీపీ ముంగర గోపాలకృష్ణ, మాజీ సర్పంచ్ బలే నాగరాజు, కరేటి శివకృష్ణ, తలారి వెంకటస్వామి, బొమ్మనబోయిన గోకర్ణ, హౌసింగ్ వర్క్స్ ఇన్‌స్పెక్టర్ లలిత, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



ధాన్యం కొనుగోలు కేంద్రంలో అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్

పామర్రు: రైతుల సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ అన్నారు. స్థానిక ఏఎంసీలోని పామర్రు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే మంగళవారం పరిశీలించారు. మండలంలో ధాన్యం సేకరణ, నగదు చెల్లింపు తదితర విషయాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కొనుగోలు విషయంలో రైతులు ఎవ్వరు కూడా ఇబ్బందులు పడకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. సంచులు, హమాలీలను ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. రవాణాకు ఏవిధమైన ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. తేమ శాతం నమోదుకు అంగీకరిస్తే రైతులు తమ ధాన్యాన్ని కేంద్రానికి తీసుకురావాలని చెప్పారు. 21 రోజుల్లో ధాన్యం నగదు రైతుల బ్యాంక్ ఖాతాల్లో జమ అవుతుందన్నారు. రైతులు ఎవ్వరూ అధైర్య పడవద్దని రైతుల వద్ద ఉన్న ప్రతి ధాన్యపు గింజను కొనుగోలు చేస్తామని స్పష్టం చేశారు. తహసీల్దార్ వి.వి.భరత్‌రెడ్డి, ఎంపీపీ అశోక్‌కుమార్, వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు, రైతులు బొమ్మారెడ్డి కృష్ణారెడ్డి, బి.మాధవరెడ్డి, ఆరుమళ్ల శ్రీనాథ్‌రెడ్డి, కూసం పెద వెంకటరెడ్డి, బొమ్మారెడ్డి నారాయణరెడ్డి, ఎం.సుబ్రహ్మణ్యం, హస్మతుల్లా పాల్గొన్నారు.

విద్యార్థినికి ట్యాబ్ బహూకరణ



కై కలూరు: మండలంలోని భుజబలపట్నం జెడ్పీ హైస్కూల్ విద్యార్థినికి దాత మంగళవారం ట్యాబ్ బహూకరించారు. పదో తరగతిలో ప్రథమ శ్రేణి సాధించిన ముంగర కీర్తికి బైర్రాజు ఫౌండేషన్ గ్రామ వికాస సమితి కన్వీనర్ ఎం.రవి కోఆర్డినేటర్ పెనుమాక భానుమూర్తి ద్వారా ట్యాబ్ అందజేశారు. ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీరాజేశ్వరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

మొవ్వ: మొవ్వ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని మొవ్వ, చల్లపల్లి, ఘంటసాల మండలాల్లోని కార్యకర్త, సహాయకుల పోస్టులు భర్తీ చేస్తూ నోటిఫికేషన్ విడుదల చేసినట్లు సీడీపీఓ పి.భానుమతి తెలిపారు. కొండవరం, గూడపాడు-1వ కేంద్రం, పెదముత్తేవి-3వ కేంద్రం, మొవ్వ-4వ కేంద్రాల్లో(జనరల్) విభాగంలో అంగన్‌వాడీ సహాయకురాలు పోస్టులతో పాటు చల్లపల్లి-7వ కేంద్రంలో అంగన్‌వాడీ సహాయకురాలు(జనరల్), ఘంటసాల మండల కొడాలి-3లో అంగన్‌వాడీ సహాయకురాలు(ఎస్సీ) విభాగంలో ఉన్న ఖాళీలు ఉన్నాయన్నారు. ఈ నెల 12వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు మొవ్వ ఐసీడీఎస్ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని కోరారు.

గుడివాడ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో..

గుడివాడరూరల్: గుడివాడ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్త, సహాయకుల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీఓ ఎ.విజయ ఫ్లోరెన్స్ తెలిపారు. ఐసీడీఎస్ కార్యాలయంలో మంగళవారం ఆమె మాట్లాడుతూ గుడివాడ అర్బన్ ప్రాంతంలోని ఎన్టీఆర్ కాలనీ-2(7వ వార్డు)లో అంగన్‌వాడీ సహాయకురాలు(బీసీ-బీ), 5వ వార్డు-2(11వ వార్డు)లో సహాయకురాలు(బీసీ-ఈ), యానదులకాలనీ-2(12వ వార్డు) సహాయకురాలు(జనరల్), 17వ వార్డు(21వ వార్డు) సహాయకురాలు(బీసీ-సీ), కార్మికనగర్-1(26వ వార్డు) సహాయకురాలు(ఎస్సీ), వాంబేకాలనీ(28వ వార్డు) సహాయకురాలు(జనరల్) ఖాళీలు ఉన్నాయన్నారు. గుడివాడ మండలంలోని బిళ్లపాడు-2 సహాయకురాలు(ఎస్సీ), నందివాడ మండలం పుట్టగుంట-3 సహాయకురాలు(జనరల్) వారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తులను ఈనెల 10వ తేదీలోగా ఐసీడీఎస్ కార్యాలయం గుడివాడలో అందజేయాలన్నారు.

గ్రామాలు అభివృద్ధి చెందాలి



వాడవల్లిలో సిబ్బందికి సూచనలిస్తున్న సీఈఓ రవికుమార్, ఎంపీపీ రామిశెట్టి

ముదినేపల్లిరూరల్: గ్రామాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందితేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యపడుతుందని జెడ్పీ సీఈఓ రవి కుమార్ అన్నారు. ముదినేపల్లి మండలం వాడవల్లిలో మంగళవారం పర్యటించి సచివాలయం చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. ముఖ్యమంత్రి ఆశయం మేరకు పలు పథకాలను సమర్థవంతంగా అమలు చేయాల్సిన బాధ్యత సచివాలయ సిబ్బందిపై ఉందన్నారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం నిర్వహణ వల్ల గ్రామాలు పరిశుభ్రంగా ఉండడంతో పాటు ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. వర్మీ కంపోస్ట్ తయారీ వల్ల పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూరుతుందన్నారు. ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, ఎంపీడీఓ పి.మల్లీశ్వరీ, సర్పంచ్ సుధాబత్తుల వెంకటరమణ పాల్గొన్నారు.